కథ

# పసి మనసులు

''పిల్లలేరి? ఎక్కడా అలికిడి లేదు'' అప్పుడే ఆఫీస్ నుండి వచ్చిన ప్రకాష్ అలసటగా కుర్చీలో కూర్చుంటూ అడిగాడు భార్యను.

''హారిక ట్యూషన్‌కి వెళ్లింది. మీ ముద్దుల కొడుకు సంగతి మాత్రం నన్నడగొద్దు'' ధుమధుమలాడుతూ అతని చేతికి కాఫీ కప్ అందిస్తూ చెప్పింది చిత్ర.

ఆమె ముఖంలో అంత అసహనం ఎందుకో అతనికెంత మాత్రం అర్థం కాలేదు.

''ఏమిటోయ్ అంతలా మండిపడ్తున్నావు? ఏమిటి సంగతి? వాడెక్కువగా అల్లరిచేసి నిన్ను విసిగిస్తున్నాడా అలా ఫైరయిపోతున్నావు?'' హాస్యంగా నవ్వుతూ అడతను వాతావరణాన్ని తేలిక పరచడానికి ప్రయత్నిస్తున్నట్లుగా.

అతని మాటలకు చిత్ర ఆనందించలేదు సరికదా మరికాస్త హీటెక్కిపోయింది.

''సంతోషించాలెండి. వాడివలన అందరి దగ్గరా చివాట్లు తినలేకపోతున్నాను'' చిత్ర కంఠంలో విసుగుతోపాటు ఒకింత బాధ కూడా తొంగి చూసింది.

ఆమె ముఖం మందారంలా కందిపోయింది.

''ఇంతకీ ఏడీ వాడు? నేను దెబ్బలాడుతానులే'' అనునయంగా ఆమెను శాంతింపజేస్తూ అన్నాడు ప్రకాష్ కాఫీ తాగడం పూర్తిచేసి.

గదిలో వున్నాడన్నట్లుగా చూపుడు వేలితో సైగ చేసింది చిత్ర.

గదిలో మంచంమీద ఓ వారగా ముడుచుకు పడుకున్నాడు ప్రణీత్. వాడి ముఖం ఏడ్చి ఏడ్చి ఉబ్బిపోయి వుంది. వాడింకా ఏడుస్తున్నాడన్నందుకు సూచనగా వాడి డొక్కలు ఎగిరెగిరి పడ్తున్నాయి. లేత బుగ్గలమీద చెంప దెబ్బలు ఎర్రని తట్లుతేలి వాతల్లా ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

వాడినలా చూసిన ప్రకాశ్ మనసు ద్రవించిపోయింది.

తండ్రిని చూస్తూనే ఏడుస్తూ కౌగలించుకున్నాడు ప్రణీత్.

''ఏం నాన్నా! ఏం జరిగింది? ఎవరు కొట్టారు నిన్ను?'' లాలనగా అడిగాడు ప్రకాశ్.

''మరి...మరి అమ్మ కొట్టింది?''

''అమ్మ కొట్టిందా? ఎందుకు?'' అని వాడినడిగి ''ఏమోయ్! ఎందుకింతలా బాదావు వీడిని?'' అడిగాడు చిత్రను.

''ఎందుకో వాడినే అడగండి.''

ఆమె పెడసరపు సమాధానం విన్న ప్రకాశ్‌కు ఒళ్ళు మండింది. అయినా తమాయించుకున్నాడు.

''అబ్బబ్బ...ఎంటి చిత్రా! ఇందాకట్నుంచి చూస్తున్నాను. ఏంటా...డొంక తిరుగుడు మాటలు...విషయమేమిటో సూటిగా చెప్పొచ్చుకదా!'' ప్రకాష్ విసుగ్గా అన్నాడు.

''విషయం ఏంటా? వీడిందాక మన ప్రక్కింటి ధనశ్యామ్ మాస్టారి అబ్బాయిని వాళ్లింటి దగ్గరే అరుగుమీద నుండి తోసేసాడట. ఆ అబ్బాయికి నుదురు మధ్యగా పెద్ద బొప్పి కట్టింది. వాళ్లావిడ ప్రత్యేకంగా నాకు కబురు పెట్టి ''చూడండి! మీ అబ్బాయేం చేశాడో...ఆడుకుంటే ఆడుకోవచ్చునుగానీ ఇలా మోటుగా తోసేస్తే ఎలా?'' అంటూ ఫిర్యాదు చేసింది. నాకు చచ్చే సిగ్గనిపించింది ఆవిడ మాటలకి'' మండిపడ్తూనే విషయం మొత్తం వెల్లడించింది చిత్ర.

''పోనీద్దు. పిల్లలన్నాక ఆటల్లో ఇట్లాంటివి సహజమే. మనం వాళ్లమధ్యన దూరకుండా వుంటే సరిపోతుంది. కాస్సేపటికి వాళ్లే సర్దుకుంటారు'' సర్దుబాటు ధోరణి పొడసూపింది ప్రకాష్‌లో.

''ఆ...నేనూ అలానే అనుకుంటాను. కానీ అవతల వ్యక్తులు కూడా మనలా ఆలోచించద్దూ. అయినా ఈ వెధవాయ్‌ని ఇంట్లోనే ఆడుకొమ్మని ఎన్నిసార్లు చెప్పినా వినడు. చక్కగా అన్నిరకాల ఇండోర్‌గేమ్స్ కొన్నాం వాడి కోసమని. వద్దు మొర్రో అంటే బయటకు పరుగెడతాడు'' చిత్ర కంఠంలో కోపపు ఛాయలింకా వైదొలగలేదు.

''ఎంతసేపూ వాళ్లనింట్లోనే మగ్గిపొమ్మనడం న్యాయమా? అసలే చదువులొచ్చి పడ్డాక పిల్లలకి బాల్యమెక్కడ వుంది? వాళ్లకి మిగిలే ఈకాస్త సమయాన్ని మనం ఇంట్లోనే బంధించేసి పాడుచేస్తే ఎలా? అలా చేయడం వలన వాళ్ళు మానసికంగా ఎదగకపోవడమే కాకుండా ఎవరితో కలవలేనటువంటి స్వభావం ఏర్పడే ప్రమాదం వుంది. చదువుకున్నదానివి కాస్తంత వివేకంతో ఆలోచించు'' కన్విన్సింగ్‌గా అన్నాడు ప్రకాష్.

ఆలోచనలో పడ్డట్టు కాస్సేపుండిపోయింది.

''నిజమేననుకోండి. నేనూ ఆమాత్రం ఆలోచించగలను. కానీ ఆ ధనశ్యామ్ మాస్టార్‌గారికి వీడు వాళ్ళ పిల్లల్తో కలవడం అంతగా ఇష్టముండదు. వీడేమో ఎంత వద్దన్నా వాళ్లింటికి వెళ్లడం మానడు. ఏం చేయాలో తోచక నేను నలిగిపోతున్నాను'' ఉక్రోషంగా అంది చిత్ర.

చిత్ర మాటల్లో కూడా వాస్తవం లేకపోలేదు.

వీళ్లింటి ప్రక్కనే ధనశ్యామ్‌గారిల్లు. ఆయనకి ఇద్దరు పిల్లలు. లేకలేక పిల్లలు కలగడంతో ఆయనకు పిల్లలంటే అపురూపం జాస్తి. పిల్లలని అస్సలు బయటకి వదలరు. ఎవరితోనూ కలసి ఆటలాడుకోనివ్వరు. వాళ్ళ అరుగుమీదే కూర్చుని వాళ్లల్లో వాళ్ళే ఆడుకుంటారు.

కానీ ఎంతయినా పిల్లలుకదా! అప్పుడప్పుడు వాళ్ల అరుగుమీదే కూర్చుని వీధిలో ఆటలాడేపిల్లల్ని సైగలు చేసి రమ్మని పిలుస్తారు వాళ్లతో ఆడమని. ఇవాళ కూడా అలాగే జరిగింది.

ప్రణీత్ వీధిలో అటూ ఇటూ తిరుగుతుంటే ఆడుకుందుకు రమ్మని పిలిచారు. ఆటల సందడిలో వాడు వెనగ్గా వచ్చి తనమీద పడిన మాస్టారి రెండో అబ్బాయి మహేష్‌ని విదిలించాడు ప్రణీత్. ఆ అబ్బాయి అరుగుమీద నుండి క్రిందకి దొర్లాడు. నుదురు బొప్పికట్టింది.

ప్రకాష్ బుజ్జగించి బ్రతిమాలి అడిగినమీదట ప్రణీత్ ఈ వైనాన్నంతటినీ బయల్పరిచాడు.

''చూశావా చిత్రా! బాబేం చెప్తున్నాడో! కావాలని తోయలేదుట. నువ్వేమో ముందూ వెనుకా చూసుకోకుండా గొడ్డును బాదినట్లు బాదావు. విషయం పూర్తిగా తెలుసుకోకుండా తొందరపడడం అంత మంచి పని కాదు'' మందలింపుగా అన్నాడు ప్రకాష్.

చిత్ర మాట్లాడకుండా ఉండిపోయింది. ఆమెకీ బాధగానే వుంది కొడుకునలా శిక్షించినందుకు.

కానీ మాస్టారి భార్య అలా కంప్లైంట్ చేసేసరికి భరించలేక వాడిని ఎడాపెడా వాయించేసింది.

''వెర్రి వెధవ...ఒళ్లంతా కందిపోయింది'' జాలిగా వాడిని దగ్గరగా పొదువుకుంటూ అనుకుందామె.

★★★

''ప్రకాష్‌గారూ! ప్రకాష్‌గారూ!'' వీధిలోంచి పిలుపు వినబడి తలుపుతీసి చూసాడు ప్రకాష్.

ఇంకెవరు? ధనశ్యామ్ మాస్టారుగారు చంకలో పిల్లాడితోసహా.

''ఇదేమన్నా బాగుందా? మీవాడేం చేశాడో చూడండి. కాస్తుంటే కన్నుపోదును'' అన్నాడతను కోపంగా చూస్తూ.

''వాడుచేసింది తప్పేలెండి. పిల్లలు కదా...ఆటల్లో పడి...'' సంజాయిషీ ఇస్తున్నట్లుగా అంటున్న ప్రకాష్‌ని మధ్యలోనే ఆపేశాడు ధనశ్యామ్.

''ఆటలేంటండీ ఆటలు! అసలే మీ అబ్బాయి మహాదుడుకు. అందుకే వాడితో అస్సలాడనివ్వను మా పిల్లల్ని'' దురుసుగా చెప్పాడతను.

''పోనీలెండి మాస్టారు. అందరు పిల్లలు ఒకే తరహాగా వుండరుకదా! ఈసారి నుండి మీ ఇంటికి రానివ్వంలెండి.''


''ఆ మధ్యా ఇలాగే మా పెద్దాడి కాలుమీద ఇటుక బెడ్డ ఎత్తేశాడుట. అందుకే మీవాడు మా ఇంటి గడపలోకి రాగానే మా పిల్లల్ని లోనికి తీసుకుపోయి తలుపు గడియవేస్తాను. అలా చేస్తేనన్నా కదుల్తాడా! అబ్బే...ఎంచక్కా తలుపు బయట గడియపెట్టి ఉడాయిస్తాడు'' అన్నాడు.

అతని మాటలో ఎక్కడా రాజీ ధోరణి లేదు. యుద్ధానికి వచ్చినట్లుగా ఉంది అతని వాలకం.

ఎంతగా సర్ది చెపుతున్నా, బ్రతిమిలాడుతున్నట్లుగా అంటున్నా అతనంతగా రెచ్చిపోవడం చూసిన ప్రకాష్‌కి

...కూడా చెల్లు మండింది.

''చూడండి మాస్టారూ! ఎంత సర్దిచెప్పినా మీరు మరీ బిగుసుకుపోతున్నారు. మీరన్నారే ఇందాక మావాడు రాగానే వాడి ముఖంమీదే తలుపేస్తానని... అదే మీరు చేస్తున్న తప్పు. మీకు, మీ పిల్లలు మావాడితో కలసి ఆడుకోవడం ఇష్టంలేకపోతే వాడిని మంచి మాటలతో





సున్నితంగా త్రిప్పి పంపేయండి. అయినా మీ పిల్లలు పిలిస్తేనే వాడు మీ ఇంటికి వస్తున్నాడు. మీరు ఏంలేనందున వాడి ముఖంమీదే తలుపేస్తే వాడి లేత హృదయం ఎంత గాయపడ్తుందో మీరు ఊహించారా? అలా చేయడంవలన వాడిలో ప్రతీకారేచ్ఛ బయలుదేరి బయట గడియ పెట్టేసి ఉండవచ్చు'' అన్నాడు ప్రకాష్ భారంగా.

అయితే ఆ మాటలకి తగ్గితే అతను ధనశ్యామ్ ఎందుకవుతాడు.

''మీవాడిని మీరు సమర్థించుకోవడం కాదండీ. చేతనైతే మీరు మాలానే పిల్లల్ని ఇంట్లోనే అట్టిపెట్టుకోండి'' అహంకారం తాండవిస్తోంది ధనశ్యామ్ వాక్కుల్లో.

అతని మూర్ఖత్వానికి, వితండవాదం చేస్తున్న అతని వింతవైఖరికి తగని చిరాకు కలిగింది ప్రకాష్‌కి. అయినా తమాయించుకున్నాడు.

''చూడండి. ఎగిరే తువ్వాయిల్లాంటివారు పిల్లలు. లేగదూడని రాటకి కట్టి ఉంచాలనుకోవడం ఎంత అవివేకమో పిల్లల్ని ఒక చోటనే బంధించి ఉంచాలనుకోవడం కూడా అంతే! మీ పిల్లలు బుద్ధిగా ఉండటం మీ అదృష్టం. కానీ అందరు పిల్లలు అలాగే ఉంటారా? అంతెందుకు మా ఇంట్లోనే తీసుకోండి. హారిక కామ్‌గా వుంటుంది. కానీ వీడు కొంచెం యాక్టివ్''

అన్నాడు ప్రకాష్ అనునయిస్తున్నట్లుగా.

''అదంతా నాకనవసరం అండీ. ఈసారిలా జరిగితే ఊరుకోను'' పెద్దగా కేకలేస్తూ వెళ్లిపోయాడు ధనశ్యామ్.

''ఇందాకా వాళ్లావిడోసారి కంప్లైంట్ చేసిందికదా. మళ్ళీ ఇతనొకడు!'' కోపంగా అంది చిత్ర.

''వాళ్ళననుకోనవసరంలేదు చిత్రా. నువ్వు మాత్రం ఏం తీసిపోయావు. ఏదో పిల్లాడికి బొప్పి కట్టిందన్న బాధతో ఆవిడ నీతో చెప్తే నువ్వు వాడిని చితక్కొట్టడం సబబేనా? అసలేం జరిగింది? తప్పెవరిది? అని ఆలోచించి ఒక వేళ ప్రణీతే గనక తప్పు చేస్తే వాడిని బుజ్జగించి ఇంకెప్పుడూ అలా చేయకూడదని మంచి మాటలతో వాడికి నచ్చచెప్పాలి'' అన్నాడు ప్రకాష్ ఆమె మాటలకు.

చిత్ర సిగ్గుతో తల దించుకుంది తన తప్పు అర్థమయినట్లు.

అది మొదలు ఆ రెండిళ్లవాళ్లకీ మాటలు బంద్. చిత్ర, ప్రణీత్‌నసలు బయటకు పంపకుండా జాగ్రత్త పడుతోంది.

★★★

ఆ రోజు ప్రకాష్ ఆఫీస్ నుండి వేగంగా ఇంటికి బయలుదేరాడు. ఎలాగూ త్రోవే కదా ప్రణీత్‌ని స్కూల్ నుండి తీసుకొద్దామని వాళ్ళ స్కూల్‌కి వెళ్లాడు.

అప్పుడే స్కూల్ వదిలినట్లున్నారు. పిల్లలందరూ గోలగోలగా బయటకు వస్తున్నారు.

ఇంతలో ప్రకాశ్ కళ్లల్లో ఓ దృశ్యం పడింది. అతను ఆశ్చర్యపోయాడు ఒక్కసారిగా.

భుజాలమీద చేతులు వేసుకుని జట్టుగా, కబుర్లు చెప్పుకుంటూ వస్తున్నారు ప్రణీత్, ధనశ్యామ్ కొడుకు రమేష్.

ప్రకాష్ ఒక్కసారిగా ఆలోచనలో పడ్డాడు.

పిల్లలకోసం, పెద్దలు పోట్లాడుకుని మాట్లాడుకోక అప్పుడే రెండు నెలలయింది.

కానీ పిల్లలు జరిగింది మర్చిపోయి ఎంత వేగంగా కలసిపోయారు?

ఆ పసిమనసులకి కక్ష కార్పణ్యాలు తెలియవు. అసూయ, ద్వేషాలుండవు. అభిజాత్యాలు అసలే వుండవు. వాటిని మనసులో పట్టించుకునేటంత వయస్సు వారికి లేదు.

ఈ పెద్దలే వారి మనసుల్లో ఇలాంటి భావాలను బలవంతంగా జొప్పిస్తున్నారు. వారికి పగ ప్రతీకారాలు తెలియవు కనుకనే పోట్లాడుకున్న వెంటనే కలసిపోయారు.

కల్మషం లేకుండా కలసిపోయారు.

కానీ... కానీ...వారి కోసం పోట్లాడుకున్న తాము పంతాలకు, పట్టుదలలకూ పోయి మాటలు మానుకుని అప్పుడే రెండునెలలయింది.

ఎందుకీ తేడా? ఎందుకీ భావ వైరుధ్యం?

పసి మనసులు ఎంత స్వచ్ఛమైనవి. ఎంతటి మాలిన్యరహితమైనవి. మేలిమి బంగారం లాంటివి ఆ పసి హృదయాలు.

తాను కూడా తిరిగి ఓ పసిపాపగా మారిపోతే ఎంతో బాగుండుననిపించింది ప్రకాష్‌కి ఆ క్షణంలో.

★

**కె.కె. భాగ్యశ్రీ**